● ఆసిఫాబాద్‌లో రైతుల ధర్నా

ఈ ఏడాది జూలై, ఆగస్టులో కురిసిన అధిక వర్షాలకు దెబ్బతిన్న పంటలకు ఇప్పటి వరకు నష్ట పరిహారం అందలేదని సోమవారం కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా రైతులు ధర్నా చేశారు. చింతలమానేపల్లి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. ప్రాణహిత నదితో పాటు దిందా-కేతిని వాగు వరదకు సుమారు 150 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని రైతులు తెలిపారు. - చింతలమానేపల్లి

● పత్తి కొనాలని ఆందోళన

గిట్టుబాటు ధర కల్పించాలని, సీసీఐ నేరుగా రైతుల వద్ద నుంచే పత్తి కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐపీకేఎస్ ఆధ్వర్యంలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో సోమవారం ఆందోళనలు జరిగాయి. ఖమ్మం ఏఎంసీలోని పత్తి యార్డులో, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ధర్నాల్లో రైతు నేతలు గుర్రం అచ్చయ్య, కెచ్చెల రంగారెడ్డి, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు. -ఖమ్మం వ్యవసాయం/పాల్వంచ

● 800 ఎకరాలు ఎండిపోవాలా?

రైల్వే మూడో లైన్ పనుల కోసం ఇష్టారాజ్యంగా కూల్చివేసిన బోనకల్లు బ్రాంచ్ కెనాల్(బీబీసీ) డ్రాప్‌లను నిర్మించాలని రైతులు డిమాండ్ చేశారు. సోమవారం ఖమ్మం జిల్లా బోనకల్లు ఇరిగేషన్ సబ్ డివిజన్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో బైఠాయించారు. నీటి సరఫరా లేకపోవడంతో ముష్టికుంట్ల, నాగులవంచ, రామాపురం గ్రామాల్లోని సుమారు 800 ఎకరాల పంటకు నష్టం వాటిల్లే అవకాశం ఉన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. - బోనకల్లు

● నకిలీ పురుగు మందుపై సమరం

నకిలీ పురుగు మందు ఇచ్చిన ఫర్టిలైజర్ డీలర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ రైతు ముగ్దం యుగేంధర్ వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలకేంద్రంలోని ఎరువుల దుకాణం ఎదుట పురుగుల మందు డబ్బాతో బైఠాయించాడు. నకిలీ పురుగు మందు వల్ల తన మిర్చి పంట దెబ్బతిన్నదని తెలిపాడు. తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేశాడు. -నల్లబెల్లి

● ధాన్యం రంగు మారిందంటూ రైతుల ఆందోళన

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం గుండారంలో 25 రోజుల క్రితం కేంద్రం ప్రారంభించినా.. కొనుగోళ్లు మొదలు పెట్టకపోవడంతో ఇటీవల కురిసిన వర్షాలకు ధాన్యం తడిసి రంగుమారుతున్నది. సోమవారం నల్లగా మారిన ధాన్యాన్ని 'నమస్తే'కు చూపిస్తూ రైతులు తమ ఆవేదన వ్యక్తంచేశారు. - ఎల్లారెడ్డిపేట

సర్కార్ మొద్దునిద్రతో రైతులకు నష్టం

- రైస్ మిల్లుల అలాట్‌మెంట్ లేదు
- ధాన్యం కొనుగోలు చేసే పరిస్థితి లేదు
- కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్ రూరల్, నవంబర్ 4 : ధాన్యం కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వం మొద్దునిద్ర పోతుండటంతో రైతులకు నష్టం వాటిల్లుతున్నదని కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కరీంనగర్ మండలం దుర్శేడ్, మొగ్దుంపూర్, చామనపల్లిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా గంగుల మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలకు రైతులు ధాన్యం తీసుకువచ్చి నెల రోజులవుతున్నా కొనడం లేదని మండిపడ్డారు. రైస్ మిల్లుల అలాట్ మెంట్ లేక ధాన్యం కొనుగోలు చేయడం లేదని అధికారులు రైతులకు చెబుతున్నారని, ప్రభుత్వం మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రారంభమైన కొనుగోలు కేంద్రాల్లో సరైన సౌకర్యాలు లేవని, ఇప్పటి వరకు గన్నీ బ్యాగుల అలాట్‌మెంట్ లేదని ఆరోపించారు. గతంలో ధాన్యం కొనుగోలుపై తాము రెండు నెలల ముందే ప్రణాళిక వేసుకుని, సెంటర్ ప్రారంభంతోనే ధాన్యం కొనేందుకు సిద్ధంగా ఉండేవారిమని గుర్తుచేశారు. ప్రస్తుత సర్కారు ముందస్తు ప్రణాళిక చేయలేక ధాన్యం కొనుగోలు చేయడం లేదని విమర్శించారు. రైతులు చేసేదేమీ లేక దళారులను ఆశ్రయించి నష్టపోతున్నారని తెలిపారు. ఇప్పటికైనా కేంద్రాల్లో సకల సౌకర్యాలతో ధాన్యం కొనుగోలు ప్రారంభించాలని, రైతులకు మద్దతు ధర అందించాలని, దళారీ వ్యవస్థను నిర్మూలించాలని డిమాండ్ చేశారు.



కరీంనగర్ రూరల్ మండలం చామనపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

నార్కట్‌పల్లి ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

కేసీఆర్ సర్కారే బాగుండె..

కాంగ్రెసోళ్లు వచ్చి రైతులను ముంచిండ్రు ● మాజీ ఎమ్మెల్యే చిరుమర్తితో రైతుల ఆవేదన

నార్కట్‌పల్లి, నవంబర్ 4 : 'కేసీఆర్ సర్కారే బాగుండే.. కాంగ్రెస్ సర్కార్ వచ్చినంక రైతులకు అన్నీ సమస్యలే.. ఎరక్కపోయి ఇరుక్కుపోయినట్లుంది' అని పలువురు రైతులు వాపోయారు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం పరిశీలించేందుకు వెళ్లిన నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యతో పలువురు రైతులతో ముచ్చటించారు. రూ.2 లక్షల రుణ మాఫీ అయ్యిందా లేదా? అని రైతులను ఆయన అడిగి తెలుసుకున్నారు. చాలామంది రుణమాఫీ కాలేదని చెప్పారు. కేసీఆర్ సార్ ఉన్నప్పుడే బాగుండేదయ్యా.. అన్ని పథకాలు టైముకు వస్తుండే అంటూ చెప్పుకొచ్చారు. కాంగ్రెసోళ్లు పంట పెట్టుబడి పైసలివ్వలేదని, ఇప్పుడు కూడా ఇయ్యమంటున్నారని తెలిపారు. ఈ సారి ఇంత వానలు కురవకపోతే నిండా మునిగేటోళ్లమని చెప్పారు. కాంగ్రెస్ సర్కారు రైతులకు ఒరగబెట్టింది ఏమీలేదని, కేసీఆర్ సారే మళ్లీ రావాలని అన్నారు. ఈ సందర్భంగా చిరుమర్తి లింగయ్య స్పందించి ధైర్యంగా ఉండాలని, రైతు సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని తెలిపారు.

ధాన్యం సేకరణలో సమస్యలు పరిష్కరించండి: సీఎం

హైదరాబాద్, నవంబర్ 4 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సాఫీగా జరిగేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలను సమర్థంగా అమలు చేసేందుకు ఉమ్మడి జిల్లాలకు కేటాయించిన ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి, కొనుగోళ్ల తీరును పరిశీలించాలని చెప్పారు. సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రభుత్వం ఆదిలాబాద్(కృష్ణ ఆదిత్య), కరీంనగర్(ఆర్వీ కర్ణన్), నిజామాబాద్ (ఏ శరత్), మెదక్(హరిచందన దాసరి), వరంగల్(టీ వినయకృష్ణా రెడ్డి), ఖమ్మం(కే సురేంద్ర మోహన్), నల్లగొండ(అనితా రామచంద్రన్), రంగారెడ్డి(డీ దివ్య), మహబూబ్‌నగర్(రవి) ఉమ్మడి జిల్లాలకు అధికారులను నియమించింది.

సిల్క్‌బోర్డ్ మ్యాగజైన్‌కు మానుకోట రైతు సక్సెస్ స్టోరీ

పార్థసారథి

కేసముద్రం, నవంబర్ 4: కేంద్ర జౌళి శాఖ ఆధ్వర్యంలో నడిచే సెంట్రల్ సిల్క్ బోర్డ్ మ్యాగజైన్‌కు మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం ధన్నసరి గ్రామానికి చెందిన పట్టు రైతు వేం పార్థసారథి సక్సెస్ స్టోరీ ఎంపికైంది. ఈయన పట్టు పురుగుల పెంపకం కేంద్రం (చాకి రేరింగ్ కేంద్రం) నిర్వహిస్తున్నారు. కూలీలకు ఉపాధి కల్పించడంతోపాటు పట్టు పురుగులను పెంచి మల్బరీ రైతులకు పంపిణీ చేస్తుంటారు. రాష్ట్రంలో అతి కొద్దిమంది చాకి రేరింగ్ రైతుల్లో పార్థసారథి ఒకరు. పట్టు పురుగుల పెంపకంలో ఆదర్శంగా నిలిచిన యువ రైతు పార్థసారథి సక్సెస్ స్టోరీ సెంట్రల్ సిల్క్ బోర్డ్ మ్యాగజైన్‌లో త్వరలో ప్రచురితం కానున్నది.

రైతు ఆత్మహత్య

- దిగుబడులు రాక.. అప్పుల తీర్చలేక బలవన్మరణం
- హనుమకొండ జిల్లాలో ఘటన

బెల్లం శ్రీశైలం (ఫైల్)

వేలేరు, నవంబర్ 4: దిగుబడులు సరిగా రాక.. పంట కోసం చేసి అప్పులు తీర్చలేక ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన హనుమకొండ జిల్లా వేలేరు మండలంలో చోటుచేసుకున్నది. వేలేరు ఎస్సై అజ్మీరా సురేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రబెల్లి గ్రామానికి చెందిన రైతు బెల్లం శ్రీశైలం (55) తనకున్న రెండెకరాల్లో వరి సాగు చేశాడు. రెండు,మూడేళ్లుగా పంటలు కూడా సరిగా పండకపోవడంతో అప్పులయ్యాయి. దీనికితోడు కూతురు పెళ్లికి అప్పు చేశాడు. మొత్తంగా రూ. 15 లక్షలు అప్పులు కావడంతో వాటిని ఎలా తీర్చాలో తెలియక మనోవేదనకు గురై సోమవారం తెల్లవారుజామున తన వ్యవసాయ బావి వద్ద గల పశువుల పాకలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సురేశ్ తెలిపారు.

నిరుడు 15 లక్షల టన్నులు.. నేడు 18 వేలే!

మొదటిపేజీ తరువాయి...

మాత్రమే కొనుగోలు చేయడం గమనార్హం. ఈ లెక్కన బీఆర్ఎస్ సర్కారు కొనుగోలు చేసిన ధాన్యంలో కాంగ్రెస్ సర్కారు 1.2 శాతమే కొనుగోలు చేయడం గమనార్హం.

మిల్లర్లతో ఒప్పందం కాకుండా కొనుగోళ్లు ఎలా?

ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని, అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పలుసార్లు అధికారులను ఆదేశించారు. కానీ, కొనుగోళ్లకు అత్యంత ముఖ్యమైన మిల్లర్లతో ఒప్పందం కాకుండా ఎన్ని చర్యలు తీసుకుంటే ఏం లాభం? అసలు సమస్యను పరిష్కరించకుండా ప్రకటనలు జారీ చేస్తే ప్రయోజనం ఏమిటి? ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి ఇప్పటివరకు మిల్లర్లతో ఒప్పందాలే జరగలేదు. తమ సమస్యలను పరిష్కరించే వరకు ఒప్పందాలు చేసుకోబోమని, ధాన్యం దించుకోబోమని మిల్లర్లు తెగేసి చెప్తున్నారు. సన్నబియ్యం అవుట్‌టర్న్‌ను తగ్గించాలని, బ్యాంకు గ్యారెంటీ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని మిల్లర్లు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం మాత్రం వీరి సమస్యల పరిష్కారంపై శ్రద్ధ పెట్టడం లేదు. దీంతో కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం ఎవరు దించుకోవాలనేది ప్రశ్నగా మారింది. ఈ విధంగా ధాన్యం దించుకునే వారు లేకపోవడంతో కొనుగోలు కేంద్రాల్లో అధికారులు కాంటా పెట్టడం లేదు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి.

కొన్నది 18 వేలు.. కొనాల్సింది 80 లక్షల టన్నులు

అక్టోబర్ 1వ తేదీ నుంచే ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించినట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఈ లెక్కన కొనుగోళ్లు ప్రారంభించి నెల దాటింది. అయినప్పటికీ, ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యం 18 వేల టన్నులు మాత్రమే. ఈ సీజన్‌లో 1.50 కోట్ల టన్నుల ధాన్యం వస్తుందని, ఇందులో 80 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని పౌరసరఫరాల శాఖ లక్ష్యంగా పెట్టుకున్నది. 18 వేల టన్నులకే నెల రోజుల సమయం పడితే, ఇక 80 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలుకు ఎంత సమయం పడుతుందనేది జవాబులేని ప్రశ్న.

పైవేటుకే సన్నధాన్యం.. సర్కారుకు కష్టమే

జనవరి నుంచి రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకోసం ఈ సీజన్‌లో 50 లక్షల టన్నుల సన్నధాన్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నది. ఇందులో భాగంగా సన్న ధాన్యానికి రూ.500 బోనస్ ప్రకటించింది. అయితే సర్కారు లక్ష్యం నెరవేరేలా కనిపించడం లేదు. ఇప్పటికే మెజార్టీ సన్న ధాన్యాన్ని ప్రైవేటు వ్యాపారులు రైతుల నుంచి కొనుగోలు చేశారు. సుమారు 30 లక్షల టన్నుల వరకు వ్యాపారులు కొనుగోలు చేసినట్టు సమాచారం. ముఖ్యంగా సన్నధాన్యం ఎక్కువగా ఉత్పత్తి అయ్యే ఉమ్మడి నల్లగొండ, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాల్లో ఎక్కవ భాగం వ్యాపారులే కొనుగోలు చేసినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో సర్కారుకు సన్న ధాన్యం రావడం కష్టమేననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవేళ వస్తే 10-15 లక్షల టన్నుల రావొచ్చని అంటున్నారు. కానీ, సన్నబియ్యం పంపిణీ చేసేందుకు ప్రభుత్వానికి 36 లక్షల టన్నుల ధాన్యం అవసరం. ఈ నేపథ్యంలో సన్నబియ్యం హామీని ఏ విధంగా అమలు చేస్తుందనేది ప్రశ్నార్థకంగా మారింది.

ఇరువర్గాల నాయకులను శాంతింపజేస్తున్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

ఎమ్మెల్యే ఎదుటే కాంగ్రెస్ శ్రేణుల గొడవ

- కొనుగోలు కేంద్రం ఏర్పాటులో భగ్గుమన్న విభేదాలు
- ఇరువర్గాలను శాంతింపజేసిన ఎమ్మెల్యే నాగరాజు

పర్వతగిరి, నవంబర్ 4: ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఎదుటే కాంగ్రెస్ శ్రేణులు గొడవకు దిగడం చర్చనీయాంశంగా మారింది. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కల్లెడలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించేందుకు ఎమ్మెల్యే రాగా, గతంలో ఏర్పాటు చేసిన స్థలంలో కాకుండా మరోచోట ఏర్పాటు చేయడం గొడవకు దారి తీసింది. దీంతో పోలీసులు, ఎమ్మెల్యే వారికి నచ్చజెప్పి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.

సర్కారుకు ఆదాయమెట్ల?

మొదటిపేజీ తరువాయి...

సచివాలయంలో భట్టి అధ్యక్షతన రిసోర్స్ మొబిలైజేషన్ క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం జరిగింది. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలుష్యం సమస్య ఉన్న పరిశ్రమల నిర్వాహకులు తాము ఔటర్ రింగ్‌రోడ్డు బయటకు వెళ్తామని సబ్ కమిటీకి తెలిపారు. వారి విజ్ఞప్తులు పరిశీలించి ఓఆర్ఆర్ బయట పరిశ్రమలు స్థాపించేలా సహకరించాలని, పరిశ్రమలను ప్రోత్సహించాలని పరిశ్రమల శాఖ అధికారులను సబ్ కమిటీ సభ్యులు ఆదేశించారు. రాజీవ్ స్వగృహ ఆధ్వర్యంలో పెండింగ్ ప్లాట్ల స్థితిగతులను సబ్ కమిటీ సమీక్షించింది.

ప్రతి నియోజకవర్గంలో ఇండస్ట్రియల్ పార్క్..

ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలో 5 ఎకరాల విస్తీర్ణంలో చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు ఇండస్ట్రియల్ పార్క్ నిర్మించాలని పరిశ్రమల శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సబ్ కమిటీ సమావేశంలో చర్చించిన అంశాలు మినిట్స్ రూపంలో నమోదుచేయాలని, వారంలో జరిగే సమావేశానికి అధికారులు యాక్షన్ టేకెన్ రిపోర్టుతో హాజరుకావాలని సూచించారు. సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ కే రామకృష్ణారావు, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిశోర్, సీసీఎల్ఏ చీఫ్ సెక్రటరీ, రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్, ఐటీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్‌రంజన్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, హౌసింగ్ సెక్రటరీ బుద్ధ ప్రకాశ్, పరిశ్రమల శాఖ స్పెషల్ సెక్రటరీ విష్ణువర్ధన్, రంగారెడ్డి, సంగారెడ్డి కలెక్టర్లు నారాయణరెడ్డి, క్రాంతి పాల్గొన్నారు.

ఏ ఆఫీసు ఫైళ్లు.. ఆ ఆఫీసుకే

- విద్యుత్తు ఒప్పందాలపై ముగిసిన విచారణ

హైదరాబాద్, నవంబర్ 4 (నమస్తే తెలంగాణ): విద్యుత్తు ఒప్పందాలు, థర్మల్ ప్లాంట్ల నిర్మాణంపై విచారణకు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన విద్యుత్తు విచారణ సంఘం తన కార్యకలాపాలను ఆపేసింది. విచారణలో భాగంగా స్వాధీనం చేసుకున్న ఫైళ్లను ఆయా ఆఫీసులకు పంపిస్తున్నారు. జస్టిస్ మదన్ బీ లోకూర్ విచారణ సంఘం అక్టోబర్ 28న నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. మొత్తం 100 పేజీల్లో రిపోర్టును రూపొందించి ఇంధనశాఖ స్పెషల్ సీఎస్ సందీప్‌కుమార్ సుల్తానియాకు అందజేసింది. ఈ కమిషన్ గడువు అక్టోబర్ 29తో ముగిసింది. దీంతో బీఆర్కే భవన్‌లోని విచారణ సంఘం కార్యాలయాన్ని ఖాళీచేస్తున్నారు. ఉద్యోగులు, సిబ్బందిని వారి సొంత స్థానాల్లో రిపోర్టు చేయాలని ఆదేశించారు. ఇప్పటికే కొన్ని ఫైళ్లను ఆయా శాఖలకు పంపించగా, ఒకట్రెండు రోజుల్లో మిగతా ఫైళ్లను సైతం పంపించనున్నట్టు కార్యాలయ వర్గాలు వెల్లడించాయి.

నేటి నుంచి టెట్ దరఖాస్తులు

- 20 వరకు దరఖాస్తుకు అవకాశం
- జనవరి 1 నుంచి 20 వరకు పరీక్షలు
- పండిట్ అభ్యర్థులకు అన్యాయం
- పేపర్ -2లో గణితం ప్రశ్నలతో సైన్స్ అభ్యర్థులకు కష్టాలు
- తొలగించాలని అభ్యర్థుల డిమాండ్

హైదరాబాద్, నవంబర్ 4 (నమస్తే తెలంగాణ): ఉపాధ్యాయ ఉద్యోగార్థులకు నిర్వహించే టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(టెట్) షెడ్యూల్ విడుదలైంది. పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి సోమవారం షెడ్యూల్ ప్రకటించారు. టెట్ నోటిఫికేషన్‌ను మంగళవారం విడుదల చేయనున్నారు. మంగళవారం నుంచే ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ ప్రారంభంకానుంది. అభ్యర్థులు ఈ నెల 20 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. జనవరి 1 నుంచి 20 వరకు టెట్ పరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. వివరాలకు https://schooledu.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని అధికారులు సూచించారు.

పండిట్లకు ప్రత్యేక పేపర్ ఉండాలి

టెట్‌లో అనుసరిస్తున్న విధానంతో బీఈడీ భాషాశిక్షణను పూర్తిచేసిన వారికి అన్యాయం జరుగుతున్నది. ప్రత్యేకించి లాంగ్వేజ్ పండిట్ అభ్యర్థులకు టెట్‌లో ప్రత్యేక పేపర్ లేకపోవడంతో వీరు నష్టపోతున్నారు. బీఈడీ వారికి నిర్వహించే టెట్ పేపర్-2లో మొత్తం నాలుగు విభాగాలుంటాయి. మొదటి విభాగంలో చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాజీ, రెండో విభాగంలో మొదటిభాష, మూడో విభాగంలో ఇంగ్లిష్ ప్రశ్నలిస్తారు. ఇవి అందరికి కామన్‌గా ఉంటాయి. కీలకమైన నాలుగో విభాగంలో గణితం సైన్స్‌కు కలిపి ఒక పేపర్, సోషల్ స్టడీస్‌కు ఒక పేపర్‌గా పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ విధానంతో బీఎడ్‌ను తెలుగుతో పూర్తిచేసిన వారు గణితం, ఫిజికల్‌సైన్స్, సాంఘికశాస్త్రం, జీవశాస్త్రం సబ్జెక్టులను చదవాల్సి వస్తున్నది. భాషా పండిత అభ్యర్థులు ఈ సబ్జెక్టులకు చెందిన 60 ప్రశ్నలను చేధించేందుకు తిప్పలుపడుతున్నారు. ఈ విధానాన్ని తొలగించాలని అభ్యర్థులు కోరుతున్నారు. ఏపీ తరహాలో భాషల్లో ప్రత్యేకంగా ప్రశ్నలివ్వాలని కోరుతున్నారు.

సైన్స్ అభ్యర్థుల పాలిట శాపంగా పేపర్-2

టెట్ పేపర్-2 సైన్స్‌లో ఇస్తున్న గణితం ప్రశ్నలను తొలగించాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు. బీఈడీలో భౌతికశాస్త్రం, జీవశాస్త్రం పద్ధతులు రెండు వేర్వేరుగా ఉంటున్నాయి. అదే టెట్‌కు వచ్చేసరికి సైన్స్ పేపర్‌లో గణితం నుంచి 30 ప్రశ్నలిస్తున్నారు. ఇది అటు జీవశాస్త్రం ఇటు భౌతికశాస్త్రం అభ్యర్థుల పాలిట శాపంగా మారుతున్నది. దీంతో అనేక మంచి అభ్యర్థులు టెట్ క్వాలిఫై కావడంలేదు. సంబంధం లేని గణితం ప్రశ్నలను తొలగించాలని ఫిజికల్ సైన్స్‌తోపాటు, బయోసైన్స్ అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు.

'ఎంఈవోల నియామకం రాజ్యాంగ విరుద్ధం'

హైదరాబాద్, నవంబర్ 4 (నమస్తే తెలంగాణ): జిల్లా పరిషత్ స్కూళ్లల్లోని హెచ్ఎంలకు మండల విద్యాధికారులుగా(ఎంఈవో) అదనపు బాధ్యతలు అప్పగించడం రాజ్యాంగ విరుద్ధమని, వారిని వెంటనే తప్పించాలని లోకల్ క్యాడర్ గవర్నమెంట్ టీచర్స్ అసోసియేషన్(జీటీఏ)ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. జోనల్ పోస్టు పదోన్నతులకు అర్హత గల ప్రభుత్వ పాఠశాలల్లోని స్కూల్ అసిస్టెంట్లకు బాధ్యతలు అప్పగించాలని కోరింది. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడోజు వీరాచారి, ప్రధాన కార్యదర్శి ఎం లక్ష్మీకాంత్ రెడ్డి సోమవారం విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశంను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఆర్టికల్-309, రూల్స్-49 కు విరుద్ధమని, దీనిపై సుప్రీంకోర్టుకు వెళ్తామని స్పష్టంచేశారు.

బోరు మోటర్‌కు తాళాలు.. తాగునీటికి తిప్పలు

చెన్నూర్, నవంబర్ 4: మంచిర్యాల జిల్లా చెన్నూర్ పట్టణంలోని పలు కాలనీల్లోని బోరు బావుల మోటర్ స్టార్టర్లకు మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది తాళాలు వేశారు. గత ప్రభుత్వ హయాం లో అన్ని వార్డుల్లో బోరుబావులు తవ్వించి తాగునీటి కోసం, గృహ అవసరాలకు సరఫరా చేస్తున్నారు. రెండు రోజుల క్రితం బదిలీపై వచ్చిన మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ ఆదేశం మేరకు సిబ్బంది పట్టణంలో బోరు మోటర్ల స్టార్టర్ బాక్స్‌లకు సోమవారం తాళాలు వేశారు. ఉదయం నుంచి నీటి సరఫరా లేక ఆయా వార్డుల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.